విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 8 పేజీలు

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవాలి

అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కట్టుకథలు చెబుతూ కాలక్షేపం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోనని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హెచ్చరించారు. కేవలం సచివాలయ ఉద్యోగులు ఇచ్చే నివేదికలపైనే ఆధారపడకుండా మండల స్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆమె స్పష్టం చేశారు. గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాథ్‌తో కలిసి ఆమె యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటించారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన పలు శాఖల మండల స్థాయి అధికారులతో ఎర్రగొండపాలెంలోని ఎం.పి.డి.ఓ కార్యాలయంలో ఆమె సమీక్ష నిర్వహించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితిని బట్టి డీప్ బోర్లు, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ట్యాంకర్ల ద్వారా మిగతా 2 లో ...

పోలింగ్..ఫైటింగ్

- పట్టభద్రులు ఎన్నికల్లో టీడీపీ నేతల బరితెగింపు
- బాపట్ల, భట్టిప్రోలులో పీడీఎఫ్ నేతలపై దాడి
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఎం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ గంగయ్య

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ఉమ్మడి గుంటూరు కృష్ణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ రోజున బాపట్ల, భట్టిప్రోలులో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద భట్టిప్రోలు మండలం టిఎంరావు హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ నేతలు పీడీఎఫ్ కార్యకర్త, ఏజెంట్‌పై దాడికి పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హై స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఉదయం నుంచి ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం మూడు గంటల తర్వాత టీడీపీ నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ పీడీఎఫ్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ హైస్కూల్ గేటు వద్దకు ఇరువర్గాలు చేరుకొని వాగ్వాదానికి దిగారు. దొంగ ఓట్లు మిగతా 2 లో ...

పోలింగ్ ప్రశాంతం

విశాలాంధ్ర - రేపల్లె : ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు పట్టణంలో రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గం పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ప్రశాంతంగా ఓట్లు వేసి అన్ని శాఖల అధికారులకు ఓటర్లు సహకరించారని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఆర్డిఓ కృతజ్ఞతలు తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో 73.16శాతం, వేమూరు నియోజవర్గ పరిధిలో 75.56శాతం పోలింగ్ జరిగినట్లు తెలిపారు. రేపల్లి వేమూరు నియోజకవర్గాల్లో మొత్తం 23 పోలింగ్ కేంద్రాల్లో 73 శాతం ఓట్లు పోలైనట్లు ఆమె తెలిపారు.

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆలపాటి

ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా గురువారం పట్టణంలోని ఓపెన్ థియేటర్లో గల ప్రకాశం మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ సందర్శించారు.

- సందర్శించిన జిల్లా కలెక్టర్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పట్టణంలోని ప్రకాశం మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోని 404,405,407,407ఏ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం అధికారులను మిగతా 2 లో ...

రైతాంగంపై దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టండి

- రైతులు పండించిన పంటలకు చట్టబద్ధత కల్పించాలి
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకిద్దాం
- మార్చి 5న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా
- 10న గుంటూరులో రాష్ట్రస్థాయి ధర్నా
- సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల పిలుపు

4లో

వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారిద్దాం

విశాలాంధ్ర-ఒంగోలు : రానున్న వేసవిలో ఒంగోలు నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అధికారులకు సూచించారు. ఒంగోలు నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ 2ను మేయర్ అధికారులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ క్రమంలో మేయర్ ఫిల్టర్ బెడ్ నందు నీటిని శుద్ధి చేసే విధానం, పంపింగ్ మోటార్స్ పనితీరును అక్కడ అధికారులుని అడిగి తెలుసుకున్నారు.

కొనకనమిట్ల పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ దామోదర్ తనిఖీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని పోలీస్ స్టేషన్ జిల్లా ఎస్పీ దామోదర్ గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను ఉమెన్ డిస్క్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ఎస్సై టి రాజ్ కుమార్‌కు సూచనలు సలహాలు చేశారు. ఎస్ఐ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్ కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అద్దంకి - శ్రీశైలం బస్సు పునరుద్ధరణ

విశాలాంధ్ర - తాళ్లూరు: అద్దంకి నుండి శ్రీశైలం బస్సు వయా తాళ్లూరు మీదుగా పునరుద్ధరణ చేయటంపై ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనవరి రెండవ తేది నుండి బస్సు ఆగిపోవటంతో విషయాఇన్న పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లారు. ఆర్టీసీ మెనేజింగ్ డైరెక్టర్ తిరుమల రావు దృష్టికి ఎస్ శ్రీనివాస రెడ్డి తీసుకువెళ్లటంతో స్పందించి బస్సు పునరుద్ధరించారు.

పోలింగ్ ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై ఓటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఆర్డీఓ రామలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు, కమిషనర్ సాంబశివరావు, హౌసింగ్ డిఈ సుబ్బారావు, టౌన్ ఆర్.ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- ఓటు వేయడం మనందరి బాధ్యత : మంత్రి అనగాని

ఓటు వేయడం మన బాధ్యత ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి, ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది పెద్ద ఆయుధం, అందరూ బాధ్యతతో ఓటు వేయాల్సిన అవసరం ఉంది, ఓటు వేస్తేనే చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి నాంది పలుకుతామని రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. అనంతరం రేపల్లె పట్టణంలోని ప్రకాశం మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

గృహ రుణాలకు పొజిషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించాలి

- పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలి
- మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి

విశాలాంధ్ర-ఒంగోలు : గృహ రుణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు ఇబ్బందులు లేకుండా ప్రజలకు సకాలంలో అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ 6 మండలాల తహసీల్దార్లు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు, హౌసింగ్ పీడీతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.....ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. భూరీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరిశ్రమలకు భూములు కేటాయించే అంశంలో రైతులు, కలెక్టర్‌తో సంప్రదించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కేటాయింపులు జరపాలని సూచించారు. గృహ రుణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు పత్రాలు సకాలంలో అందజేయాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అనంతరం గ్రామ సచివాలయ యానిమల్ హస్బండ్రీ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అటెండెన్స్ ఆప్షన్‌లో అధర్ ఆప్షన్ ని పునరుద్ధరించరాలని మంత్రిని కోరారు, దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

పోలింగ్..ఫైటింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు వేయిస్తున్నారంటూ పిడిఎఫ్ కార్యకర్తలు ప్రశ్నించడంతో దాడి జరిగింది. ఈ క్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు పిడిఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్ కుమార్‌పై దాడి చేశారంటూ పిడిఎఫ్ నేతలు బాపట్ల పోలీస్ స్టేషన్లో గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ గుంటూరు కృష్ణాజిల్లాల పట్టబద్రుల ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఓటమి భయంతో దొంగ ఓట్లు వేయించుకోవడానికి పిడిఎఫ్ అభ్యర్థి కే.ఎస్ లక్ష్మణరావు మద్దతుదారులపై దాడులు దౌర్జన్యం చేయడానికి పదే పదే ప్రయత్నించిందన్నారు. పోలింగ్ ముగిసే సమయంలో కూటమి నేతలు పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేయటానికి మనుషులు తీసుకొచ్చిన సందర్భంలో ప్రశ్నించిన పిడిఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్‌కుమార్‌పై తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు దాడి చేశాడన్నారు. అత్యంత దుర్మార్గంగా పోలీసుల ముందే పట్టణ సీఐ ముందే దాడికి పాల్పడ్డాడని తెలిపారు.గొల్లపల్లి శ్రీనివాసరావు దాడి చేసిన వీడియోలు ఉన్నాయన్నారు.తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారం మదంతో మేమేం చేసిన చెల్లుతుందని పద్ధతుల్లో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. తెలుగుదేశంపార్టీ నేతలు చేస్తున్న అరాచకాలు అన్యాయాలు ప్రజలంతా గమనిస్తున్నారని పెద్దల సభకు జరిగే ఎన్నికకు సాధారణ ఎన్నికల్లో లాగా దౌర్జన్యాలకు పాల్పడుతూ డబ్బులు పంపిణీకి టిడిపి నేతలు పూనుకున్నారన్నారు.గొల్లపల్లి శ్రీనివాసరావు ఏదో అనుకుంటున్నావేమో నీ సంగతి మేము చూస్తాం..పద్ధతిగా ఉంటే పద్ధతిగా ఉంటుందని మండిపడ్డారు.దౌర్జన్యం చేసి అధికారం ఉంది కదా అని అధికారం మదంతో ఏం చేసినా చెల్లుతుందనుకుంటే నీ ఆటలు సాగవు అని హెచ్చరించారు.దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- భట్టిప్రోలు మండలంలో ఎన్నికల ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లింగం శ్రీనుపై భట్టిప్రోలు తెలుగుదేశం కార్యకర్త కంభం సుధీర్ భౌతిక దాడికి పాల్పడ్డాడు. కంభం సుధీర్ తెలుగుదేశం అభ్యర్థి అలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు దొంగ ఓటు వేసేందుకు వెళ్లగా కేఎస్ లక్ష్మణరావు ఏజెంట్ అభ్యంతరం తెలియజేశాడు. దీంతో ఆగ్రహించిన కంభం సుధీర్ నన్నే ఆపుతావా అంటూ చొక్కా పట్టుకొని కిందపడేసి తన ఐడెంటి కార్డుని చించేశారు.ముఖంపై పిడుగుద్దులు గుద్దాడు.ఈ పరిణామంతో పోలింగ్ కేంద్రం వద్ద కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిపిఎం మండల కార్యదర్శి జి సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికలలో దాడికి పాల్పడడం తగదన్నారు.తెలుగుదేశం కార్యకర్తలు మధ్యాహ్నం నుండి విచ్చలవిడిగా రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని అనేకసార్లు పోలింగ్ ఆఫీసర్, విధుల్లో ఉన్న ఎస్ఐకి ఫిర్యాదు చేసినప్పటికీ వారు సరిగా స్పందించలేదని ఫలితంగానే మా ఏజెంట్‌పైన దాడి జరిగిందన్నారు.

ఈ దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోని కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ గొల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, వసంతరావు, కొండయ్య, నాగేశ్వరరావు, అనిల్ కుమార్ ఉన్నారు.

సమస్యలు తెలుసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

సరఫరాలో సహేతుకత ఉండాలని చెప్పారు. ఈ నీటి సరఫరాలో అవకతవకలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. తాగునీటి నాణ్యత నిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదని, క్లోరినేషన్‌తో పాటు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. తమకు తాగునీళ్లు లేవని ప్రజలు ఫిర్యాదు, ఆందోళన చేసే పరిస్థితి తలెత్తితే ఆయా మండలాల ఆర్.డబ్ల్యు.ఎస్. ఏ.ఈ.లతో పాటు ఎం.పి.డి.ఓ.ల పైనా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. తాగునీటి సమస్యల పైనా స్థానిక ప్రజలతో అధికారులు మాట్లాడాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం కూడా ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్నిచోట్ల ఆయా కేంద్రాలను పది రోజుల్లోగా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పి - 4 సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు . మొక్కుబడిగా కాకుండా ఈ సర్వే ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. ఫారం పాండ్స్, అదేవిధంగా ఇంకుడుగుంతల ప్రాధాన్యాన్ని కూడా రైతులకు, ప్రజలకు వివరించి వీటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆమె

ఆదేశించారు. ఫారం పాండ్స్ నిర్మాణంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించకుండా కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ చెప్పారు. మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, ఆధార్ కార్డు లేని బాలలను గుర్తించి వారికి ఆధార్ కార్డులను మంజూరు చేసేలా తీసుకోవలసిన చర్యలను కూడా వేగవంతం చేయాలని చెప్పారు. దీనికి ముందుగా ఎర్రగొండపాలెంలోని రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ఈ ప్లాంట్ సామర్థ్యము, క్లోరినేషన్ చేస్తున్న విధానాన్ని అధికారులు ఆమెకు వివరించారు.

ప్రజలతో ముఖాముఖీ :

తొలుత పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాలలోని పలు గ్రామాలలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. పుల్లలచెరువు తహసిల్దార్ కార్యాలయాన్ని, ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వే, మ్యుటేషన్ల తీరును ఆన్లైన్లో పరిశీలించారు. అదే మండలంలోని పిడికిటి వారి పల్లెలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న ఫారం పాండ్‌ను పరిశీలించారు. చాపల మడుగు గ్రామంలో పి-4 సర్వేను, ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పై ప్రజలతో మాట్లాడారు. ఈ గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను పరిశీలించారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీని కోసం ముందస్తుగా రైతులకు నోటీసులు ఇవ్వాలని అన్నారు. చెన్నంపల్లి హ్యాబిటేషన్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తేకపోవటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి తనకు నివేదిక పంపాలని ఆదేశించారు. ఎర్రగొండపాలెం మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోవటం ద్వారా పరిసరాలు శుభ్రంగా ఉంటాయని, భూగర్భ నీటిమట్టం కూడా పెరుగుతుందని చెప్పారు. అందుకే వీటి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత అవసరం అన్నారు. ఇదే గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కూడా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సరఫరాపై స్థానికులతో ఆమె మాట్లాడారు.

కాటి వీరన్న చెరువుకు సాగర్ జలాలు ఇస్తే

ప్రభుత్వానికి రూ.2కోట్లు ఆదా

కలెక్టర్‌కు విన్నవించిన సీపిఐ నేత జీవీ గురునాథం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారీయా పుల్లలచెరువు మండలంలో జరుగుతున్న రీ సర్వేను ఆకస్మిక తనిఖీ నిమిత్తము గురువారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియాను సిపిఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి మండల అభివృద్ధిని, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మండలంలోని కొన్ని సమస్యలపై గురునాథం జిల్లా కలెక్టర్కు మెమోరాండంను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ముటుకుల గ్రామం దగ్గర సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి సాగర్ జలాలను మండల కేంద్రమైన పుల్లలచెరువులోని కాటి వీరన్న చెరువును నింపినట్లైతే ఇక్కడి నుండి అనేక గ్రామాలకు తాగునీటి సరఫరాను చేసి మండలంలో కొంతమేర త్రాగునీటి సమస్య తీరుతుందని గురునాథం తెలిపారు. వేసవిలో ట్యాంకర్ ద్వారా మండలంలో నీటి సరఫరా అయ్యే ఖర్చును తగ్గించవచ్చునని ఈ విధంగా చేసినట్లయితే రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కోట్ల మేర నష్టం వాటిల్లకుండా ఉంటుంది. ఈ విషయాన్ని అధికారులు పరిశీలించి పనులు చేపట్టాలని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మండల కేంద్రమైన పుల్లలచెరువులో హిందూ స్మశాన వాటిక కనీస సౌకర్యాలు కూడా లేవని ఒక డీప్ బోరును ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 480 మంది విద్యార్థిని,విద్యార్థులకు కేవలము 7 మంది ఉపాధ్యాయులు మాత్రమే విద్యను బోధిస్తున్నారు. అంతేకాక ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు కూడా లేరు. కేవలం ఇంచార్జి ప్రధానోపాధ్యాయునితో కొనసాగిస్తున్నారని తెలిపారు. దీనికి ఉదాహరణ ఇటీవల కాలంలో మార్కాపురం సబ్ కలెక్టర్ పుల్లల చెరువు తహశీల్దార్ కార్యాలయాన్ని, గ్రామంలోని సచివాలయం-2ను తనిఖీ చేసినప్పుడు సచివాలయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా విధుల్లో లేకపోవడంతో ఆగ్రహించిన సబ్ కలెక్టర్ స్థానిక ఎంపీడీవో వసంత్రావు నాయక్ మొబైల్ ద్వారా ఫోన్ చేసి సచివాలయ ఉద్యోగస్తులందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయమని హుకుం జారీ చేశారనేది ఒక వాస్తవమైన ఉదాహరణ. అసలు విచిత్రమైన సంగతి ఏంటంటే మండల స్థాయి అధికారులే పూర్తిగా సమయపాలన పాటించకుండా వారికి ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి రావడం పోవటం జరుగుతుందని ఇదేమీ పని అని ప్రశ్నిస్తే మేము ఫీల్డ్ వెరిఫికేషన్ పోతున్నామని మాటలు చెప్పి సమస్యను కప్పిపుచ్చుతున్నారని గురునాథం కలెక్టర్‌కు తెలిపారు.

అర్హులందరికీ కమిటీలో సముచిత స్థానం

విశాలాంధ్ర-చీమకుర్తి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి సంతనూతల పాడు నియోజకవర్గ ఇన్చార్జ్ మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో చీమకుర్తి మండల వైసీపీ నూతన కమిటీ కోర్టు మున్సిపాలిటీ నూతన కమిటీ అనుబంధ విభాగాల్లో నియామకాల కొరకు గురువారం చీమకుర్తి మండల పట్టణ వైయస్సార్సీపీ నాయకుల కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకొని అర్హత గల ప్రతి ఒక్కరికి కమిటీల సమితి స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పార్టీకి, పార్టీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేసిన వారికి వైఎస్ఆర్సీపిలో ప్రముఖస్థానం కల్పిస్తామని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కమిటీ వెంకటేశ్వర్లు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు జెడ్పిటిసి వేమా శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ మనం శ్రీధర్ బాబు పట్టణ పార్టీ అధ్యక్షుడు కిష్టిపాటి శేఖర్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ గోపరపు పూర్ణచంద్ర రాజ్యలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా అంకుల్, పాటిబండ్ల గంగయ్య బెల్లం వెంకట్రావ్ కౌన్సిలర్స్ సర్పంచులు ఎంపీటీసీలు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీగా నూతనంగా నియమితులైన గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, వేమా శ్రీనివాసరావు, యన్నం శేషిరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మని సన్మానించారు.

బూదవాడలో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం బూదవాడ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతు సోదరులను ఉద్దేశించి చీమకుర్తి మండల వ్యవసాయ శాఖ అధికారి డి.వి.భాస్కర్ 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి వివరించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార కార్డు తరహాలో రైతులకు అందించనుందని తెలిపారు. ప్రతి రైతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు రాయితీలు పొందాలంటే ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయాలని చెప్పారు. వ్యవసాయ సంబంధిత సేవలను పొందటానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని రైతుకు చేకూరే ప్రయోజనాలు విశిష్ట సంఖ్య అర్హులైన భూమిగల రైతుల గుర్తించడంలో తోడ్పడుతుందని వివిధ సబ్సిడీలు పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక అమరావతి గ్రౌండ్ నందు తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఒక్కటై ముందుకు సాగాలని పార్టీని మరింత బలంగా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందులో భాగంగానే సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సభ్యత్వం చేసుకున్న ప్రతి కార్యకర్తకు సభ్యత్వ కార్డు అందజేయాలని తెలిపారు. నాపై నమ్మకంతో నాకు ఓటు వేసి గెలిపించిన ప్రతి కార్యకర్తకు అలాగే తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఎల్లవేళలా అండగా ఉంటానని తెలియజేశారు. కనిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తానని మీ అందరి సహాయ సహకారాలతో కనిగిరిని కనకపట్టణంగా తీర్చిదిద్దుకుందాం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బూత్ ఇన్చార్జ్‌లకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సభ్యత్వ కార్డులు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుల పర్యవేక్షణలో వీటిని వెంటనే సభ్యత్వం చేసుకున్న సభ్యులకు, పార్టీ సభ్యత్వ కార్డులు అందేలా చూడాలన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వారందరికీ కార్డులు పంపించడం జరుగుతుందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జ్‌లు జరిగింది.

10మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 10మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్వీ బాలయ్య తెలిపారు. కొనకనమిట్ల మండలంతో పాటు పొదిలి మర్రిపూడి, వెలిగండ్ల బొట్లగూడూరు మండలాల నుంచి వచ్చిన మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామన్నారు. ప్రభుత్వము వారికి అందిస్తున్న పారితోషకాన్ని త్వరలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సురేఖ వైద్య సిబ్బంది స్టాఫ్ అసలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరిని కలిసిన అపిశెట్టి ఉదయ్ శంకర్

విశాలాంధ్ర-రాచర్ల : ఒంగోలు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు పీవీ శివా రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమం ఒంగోలు విష్ణుప్రియ కన్వెన్షన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి విచ్చేశారు. ఈ సందర్భంగా గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్ శంకర్ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా గిద్దలూరు పట్టణ బీజేపీ పార్టీ కార్య క్రమాలు, పార్టీ చేరికలు,పట్టణ కార్యవర్గ సభ్యులు నియామకం, పట్టణ బూత్ అధ్యక్షులు నియామకం గురించి వివరించారు.

మార్చి 2న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-వెలిగండ్ల: మార్చి నెల రెండవ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు శాఖల వారీగా పూర్తి సమా చారంతో హాజరు కావాలన్నారు. ఈ సమావేశానికి జెడ్పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు హాజరవుతారని తెలిపారు సమావేశానికి గైర్హాజరైన అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

కొనకనమిట్లలో క్లీన్ అండ్ గ్రీన్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలో పంచాయితీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వీధులు శుభ్రం చేయించి బ్లీచింగ్ సున్నం చల్లించారు కాలువల్లోని మురుగును తొలగించి శుభ్రపరిచారు. గ్రీన్ అంబాసిడర్లు ద్వారా గృహాల నుంచి తడి చెత్త పొడి చెత్తను సేకరించారు యజమానులకు వ్యక్తిగత శుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని మండల పంచాయతీ అధికారిని శ్రీదేవి పర్యవేక్షించారు.

రుణాలను త్వరగా చెల్లించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలతో ఆదాయాభివృద్ధిని పరుచుకొని, తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని వెలుగు దర్శి ఏరియా కోఆర్డినేటర్ సి.వసుంధర దేవి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య కార్యనిర్వహణ సమావేశం మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈ వెంకాయమ్మ అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేపలు పెంచుకునే వారిని గుర్తించడం, లోకోస్ సంఘాలను బలోపేతం చేయడం, సిఐఎఫ్, వి ఆర్ ఎస్, ఉన్నతి ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించి మరల కొత్త రుణాలతో అభివృద్ధి చేసుకోవాలన్నారు. లోగోస్ కట్ ఆఫ్ డేటా, లక్పతి దీదీ గురించి, ఉమెన్ లెడ్ ఎంటర్ప్రైజెస్, సీడ్ క్యాపిటల్, పీఎంఈజీపి, పి ఎమ్ ఎఫ్ ఎం ఈ, చేయాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, వివో బుక్స్ గురించి, వివో ఎలా పనితీరు గురించి, జెండర్స్ కార్యక్రమాన్ని గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం ఎం హనుమంతరావు, వెలుగు సిసి కే కోటేశ్వరరావు, అకౌంటెంట్ జి మార్తమ్మ, వివో ఏలు, పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉల్లగల్లు, పులిపాడు గ్రామాలలో గల పంట పొలాలను గురువారం మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట రబీ 2024 -25 సంవత్సర సంబంధించి మార్చి మూడో తేదీ వరకు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మార్చి 5 నుండి 10వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి రబీ ఈ పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విశిష్ట సంఖ్య నమోదులో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కందుల రైతులు గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాలకు వెళ్లి కందులను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వేమూరి శ్రీ కీర్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆంజనేయులు, క్రాంతి రత్న, రైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం అధికారుల సందర్శన

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని బచ్చల కూరపాడు గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో డి.ఈశ్వరమ్మ ఈవోపీఆర్ డి.శ్రీదేవిలు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాన్ని శుభ్రపరిచి గ్రామంలోని గృహాల్లో నుంచి సేకరించిన తడి చెత్త పొడి చెత్తను, సంపద కేంద్రాల్లో వేయించి వర్మీ కంపోస్ట్ తయారు చేసేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కిరణ్‌కు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతాంగంపై దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టండి

- రైతులు పండించిన పంటలకు చట్టబద్దత కల్పించాలి
- డాక్టర్ స్వామినాథ సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాలి
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకిద్దాం
- మార్చి 5న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా
- 10న గుంటూరులో రాష్ట్రస్థాయి ధర్నా
- సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు :

దేశంలో రైతాంగ ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రపూరిత దుష్ప్రచారాన్ని తిప్పి కొడుతూ మార్చి5వ తేదీన జిల్లా కేంద్రాలలో, మార్చి 10న గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి ధర్నాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్లో సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ దేశంలోని జాతీయస్థాయిలో సంయుక్త కిసాన్ మోర్చా ఐక్యత తీయటమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగా అనేక కథనాలను ప్రచారం చేస్తూ గిట్టుబాటు ధరలపై ఒప్పందం కుదురుతున్నట్లు పొట్ల పూజితమైన దుష్ప్రచారం చేస్తున్నారని ధైర్యమెత్తారు. దుష్ప్రచారాన్ని రైతాంగమంతా ఐక్యతతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు మేరా సీ 2ం 50శాతం (సమగ్ర పంటల ఉత్పత్తి ఖర్చుకి 50 శాతం అదనంగా కలిపి) మద్దతు ధరను చట్టబద్ధత చేసేంతవరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు. ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కె.హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైట్ బర్లి, బ్లాక్ బర్లీ పొగాకు దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందన్నారు. పెట్టుబడులు మాత్రం విపరీతంగా పెరిగాయన్నారు. వ్యాపారులు క్వింటాకు గత ఏడాది కన్నా రూ. 4 నుండి 5వేలు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ధరల స్థిరీకరణ నిధిని రూ.3 నుండి4 వేల కోట్లు ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ సహజంగా దొరికే నీటిని చంద్రబాబు నాయుడు సరుకుగా చూస్తూ వ్యవసాయానికి నీటిని అమ్మేందుకు చూడటం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రంలో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. క్వింటాకు రూ. 20 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ జామాయిల్, సుబాబుల్ కర్రను పెరిగిన ధరలకు అనుగుణంగా కాకుండా, ఐటిసి కూటమి మాటున క్వింటాకు రూ.1000 నుండి 1500 వరకు వ్యాపారులు తగ్గించి కొనుగోలు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. తగ్గిన జామాయిల్ సుబాబుల్ కర్ర ధరలకు నిరసనగా మార్చి 3వ తేదీన ఖమ్మం జిల్లాలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అందుకు అనుకూలంగా ప్రకాశం, కృష్ణ, గుంటూరు జిల్లాలలో కూడా కర్ర రైతులు ఆందోళనలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రకాశం జిల్లాలో సాగు చేసిన తేజ రకం మిర్చి ధర క్వింటాకు రూ.13 నుండి 14 వేల వరకు గుంటూరు మిర్చి యార్డులో ధర పలుకుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మిర్చికి రూ. 11 781 మద్దతు ధర ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వాల ప్రకటన మిర్చి రైతులు మరింత అప్పులు ఊబిలో ముంచేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ సాయి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 2000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విప్లవ రైతు సంఘం జిల్లా కన్వీనర్ భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు మాట్లాడుతూ కంది, శనగ, మినుము వంటి అపరాల పంటలు దిగుబడులు గణనీయంగా తగ్గాయి అన్నారు.

2024లో వరికి 75 కేజీల టిక్కీ ధర రూ. 2,200 పలికితే ఈ ఏడాది రూ.1400కు పడిపోయిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు సిహెచ్ సాగర్, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు గ్రామంలో సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో ప్రభుత్వం మద్దతు ధరకు కందులు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ మార్క్ఫెడ్ మరియు నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు 7550 రూపాయలకు ఈ సొసైటీ కేంద్రంలో లభిస్తుందని సొసైటీ సీఈవో కేవిబి నర్సయ్య తెలిపారు. అవకాశాన్ని మండలంలోని వేముల, వేముల బండ, పులిపాడు, కెల్లంపల్లి, పసుపుగల్లు, పెద్దఉల్లగల్లు, ముండ్లమూరు, సింగనపాలెం గ్రామాలలో రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఎకౌంటు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. మట్టి పదార్థాలు ఉన్నట్లయితే 2శాతం, కల్తీ గింజలు అయితే3 శాతం, దెబ్బతిన్న గింజలు అయితే3 శాతం, పాక్షికంగా దెబ్బతిన్న రంగు మారిన విరిగిన గింజలు 4 శాతం, పరిపక్వము లేని పూర్తిగా తయారు కానీ గింజలు అయితే 3 శాతం, పురుగు పట్టిన గింజలు అయితే 4 శాతం, తేమ 12 శాతం ఉన్నట్లయితే తగ్గించడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర విద్యా భూషణ్ అవార్డు అందుకున్న తెలుగు పండిట్ రామారావు

విశాలాంధ్ర-కొనకనమిట్ల :

కొనకనమిట్ల మండలంలోని చిన్నారి కట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న, పొదిలి బాప్టిస్ట్ పాలెంచెందిన ఏపీటీఎఫ్ కొనకనమిట్ల మండల అధ్యక్షుడు తాళ్లూరు రామారావు రాష్ట్ర విద్యా భూషణ్ అవార్డును జిల్లా కలెక్టర్ తమిళ్ అన్సారి చేతుల మీదుగా అందుకున్నారు. విశాఖపట్నం అబ్దుల్ కలాం మెమోరియల్ ఆర్గనైజేషన్ వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా 2025 సంవత్సరానికి రాష్ట్ర విద్యా భూషణ్ అవార్డును ప్రశంస పత్రాన్ని అందజేశారు. రామారావు కు పద్మభూషణ్ అవార్డు రావడం పట్ల ఏపీటీఎఫ్ పొదిలి మండల ప్రధాన కార్యదర్శి మంచి కల పెద్ద కోటేశ్వరరావు, కొనకనమిట్లమండల ఏపీటీఎఫ్ప్రధాన కార్యదర్శి తోట యోగి రాములు, చిన్నారి కట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, పొదిలి డివిజన్ ఎంఈఎఫ్ అధ్యక్షులు గాలి మట్టి రమేష్, సభ్యుడు గొల్లపూడి జాన్ బాబు,ఎంఆర్పిఎస్ నాయకులు, సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర - బాపట్ల : గ్రాడ్యుయేషన్ శాసనమండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు బాపట్ల జిల్లాలోని 12 మండలాలలో గురువారం జరిగాయి.జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి రేపల్లె,బాపట్ల మండలాలలో విస్తృతంగా పర్యటించారు.రేపల్లె పట్టణం ప్రకాశం మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఒకే ప్రాంతంలో 404,405,406,407,407ఎ ఐదు పోలింగ్ కేంద్రాలు,అక్కడే 3,340 మంది ఓటర్లు ఒకే పాఠశాల పరిధిలో ఉండడంతో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలోనికి వెళ్లి పోలింగ్ సరళిని ఆయన నిశితంగా పరిశీలించారు.పోలింగ్ విధానం,పోలింగ్ శాతంపై పిఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.స్వేచ్ఛగా ఓటు వేయడానికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ నేరుగా ఓటర్లతోనూ ఆయన మాట్లాడారు. క్యూలో నిల్చొని ఒక్కొక్కరు ఓటు వేయడానికి కొంత సమయం పడుతుందని ఓటర్లు ఆయన దృష్టికి తెచ్చారు. పోలింగ్ ప్రక్రియ వేగంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. సెక్టార్,రూట్ ఆఫీసర్లకు ఆయన పలు సూచనలు చేశారు.ఆయన వెంట రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు,తహసిల్దార్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

- శాసనమండలి ఎన్నికలలో శాంతిభద్రతలకు ఎక్కడ ఎలాంటి విఘాతం కలగలేదని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు.బాపట్ల పట్టణం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని 413, 414, 413-ఏ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.413 పోలింగ్ కేంద్రం పరిధిలో 546 మంది ఓటర్లు ఉండగా, మధ్యాహ్నం 1:45 గంటలకు 300 ఓట్లు పోలయ్యాయని సంబంధిత పిఓ కలెక్టర్‌కు వివరించారు.బాపట్ల పట్టణంలో పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు.అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు.బాపట్ల జిల్లాలోని బాపట్ల,వేమూరు,రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 12 మండలాలలో ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. పట్టభద్రుల ఓట్లు అధికంగా ఉన్న రేపల్లె, బాపట్ల మండలాలలో పరిశీలించామన్నారు. ఓటర్లకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఆయన వెంట జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్,బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా,మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి,తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : వచ్చే నెల 3వ తేదీలోగా ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కే.వెంకటకృష్ణ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.ఆయా గ్రామాల్లో వరి,మొక్కజొన్న పంటలను పరిశీలించారు.ఏవో మాట్లాడుతూ వరి పొట్ట దశలో ఉన్నప్పుడు గింజ నాణ్యత కోసం పొటాష్ వేసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,గ్రామ వ్యవసాయ సహాయకులు రఫీ తదితరులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పీఎం కిసాన్ నిధులు ఇప్పటికే చాలా మంది రైతుల ఖాతాలలో రూ.2000 చొప్పున జమ అయ్యాయని మండల వ్యవసాయ అధికారి ఏ.మహేష్‌బాబు అన్నారు.రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం రైతులకు అందించే ఏ పథకం కూడా వర్తించదన్నారు.గురువారం రాంభట్లవారిపాలెం,కుంచాలవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు విశిష్ట నమోదు సంఖ్యను పొందాలని రైతులకు తెలియజేశారు.అనంతరం క్షేత్ర సందర్శన చేసి రైతులకు సలహాలు సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు,గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ఈ కేవైసీ పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలం తమ్మవరం, అనమనమూరు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఈ పంట నమోదు చేసుకున్న రైతులందరూ ఈ కేవైసీ పూర్తి చేయించుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో క్షేత్రస్థాయి పరిశీలనలో సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ప్రతి భూమి కలిగిన రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తద్వారా పీఎం కిసాన్ పొందే అవకాశం ఉంటుందని త్వరగా ఈ కేవైసీ చేయించుకోవాలని మార్చి 3 తేదీ చివరి రోజు కావడంతో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు కోరారు.అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ వంటి పథకాలు పొందుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఆఫ్రిన్ , రైతులు పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నేషనల్ హై వే 216 సమీపంలో చీరాల మండలం వాడరేవు గ్రామం నుండి పిడుగురాళ్ల వరకు వెళ్లే ఫోర్ వే లైన్ బైపాస్ నిర్మాణంతో బుర్లవారిపాలెం గ్రామంతో పాటు మరో పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వెంటనే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని బుర్లవారిపాలెం గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య సమస్యను హైవే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బ్రిడ్జి నిర్మించే విధంగా పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన గుళ్ళపల్లి జాతీయ రహదారిపై చోటుచేసు కుంది.స్థానికుల కథనం ప్రకారం స్ఫూర్తిమెడికల్ షాప్ ఎదురుగా రోడ్డు దాటుతున్న యువకుడిని స్పీడ్‌గా భట్టిప్రోలు వైపు వెళుతున్న ఏపీ 07 టిబి 7 008 నెంబర్ గల టాటా ఏసీ వాహనం బలంగా ఢీకొనడంతో యువకుడు గాయాల పాలయ్యాడు.అదే వాహనంలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజా రంజక పాలనే లక్ష్యం

విశాలాంధ్ర - చీరాల : నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తూ ప్రజా రంజక పాలనే లక్ష్యంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యకు ప్రత్యేక ధన్యవాదాలని ప్రజా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు టీడీపీ సీనియర్ నాయకులు గుమ్మడి ఏసు రత్నం అన్నారు. కుందేరు అభివృద్ధిపై చర్యలకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళీ అధికారులను ఆదేశించిన సందర్భంగా గుమ్మడి ఏసు రత్నం మీడియాతో మాట్లాడారు.ఎన్నికలకు ముందు అన్ని రాజకీయ పార్టీ నాయకులు హామీలను ఇచ్చి ఎన్నికలయ్యాక మార్చిపోతారని ఎమ్మెల్యే మాలకొండయ్య మాత్రం ప్రజారంజక పాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు.ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని చీరాల అభివృద్ధిలో కుందేరు అంశం తొలి అడుగన్నారు.రాత్రికి రాత్రి అన్ని పనులవ్వ వని, ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రజలు కోరుకున్న బీసీ నాయకుడు ఎమ్మెల్యేగా ఉంటే గిట్టని ప్రతిపక్ష నాయ కులు అవినీతి బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలకు ఎమ్మెల్యే మాలకొండయ్య పనితోనే సమాధానం చెబుతారన్నారు.ఇప్పటికైనా ప్రతి పక్ష నాయకులు చీరాల అభివృద్ధికి సలహాలు, సూచనలు చెయ్యాలని ఆకాశంపై ఉమ్మితే తిరిగి అది మీ పైనే పడుతుందని హితువు పలికారు. అనునిత్యం చీరాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు గుమ్మడి ఏసురత్నం కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగులో త్రిబుల్ బోనాంజా ఎంటర్‌టైన్‌మెంట్

విశాలాంధ్ర-ఒంగోలు : జీ తెలుగు మరో త్రిపుల్ బొనాంజా ఎంటర్‌టైన్‌మెంట్ తో మార్చి 1 నుంచి 3 వరకు ప్రేక్షకుల ముందుకు రాబోతోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా మార్చి 1వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రసారమవుతుంద న్నారు. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథాంశంతో అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా బాక్సాఫీస్ హిట్ గా నిలిచిందన్నారు. నాన్-ఫిక్షన్ షోలలో ఒకటైన సూపర్ సీరియల్ ఛాంపియన్‌షిప్ మార్చి 2వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రసారమవుతుంది. ఈ లాంచ్ ఎపిసోడ్‌కు ప్రముఖ నటులు శ్రీకాంత్, రోజా, రాశి, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ బుల్లిరాజు అతిథులుగా హాజరై మరింత వినోదాన్ని అందించనున్నారన్నారు.యాంకర్ రవి, అషు రెడ్డి వ్యాఖ్యాతలుగా వ్యవహరించను న్నారన్నారు. అలాగే, జీ తెలుగు మరో అద్భుతమైన కథతో రూపొందుతున్న లక్ష్మీ నివాసం సీరియల్‌ను మార్చి 3వ తేదీ నుంచి ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు ప్రసారం చేస్తుందన్నారు.

రైల్వే ట్రాక్‌పై మహిళ మృతదేహం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె.ప్రసాద్ గురువారం తెలిపారు.ఆయన తెలి పిన వివరాలు ప్రకారం ముస్తాబాద్- గుణదల మెయిన్ రైల్వేట్రాక్ పై దాదాపు 35 నుండి 40 సం.ల వయస్సు ఉన్న మహిళ మృతి ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఘటనాస్థలం వద్దకు వెళ్ళి పరిశీలించగా మృతురాలు ఎత్తు 5.2 తో చామన ఛాయ రంగు కలిగి ఉంది. శరీరంపై చిరిగిపోయిన గులాబీ రంగు నైటీ, లంగా మాత్రమే వేసుకుంది. రైలు నుండి జారీ గాని, రైల్వేట్రాక్ దాటుతుండగా గాని మృతి చెంది ఉండవచ్చు అనే అను మానం కలుగు తుంద న్నారు. ఎవరికైనా వివరాలు తెలిసినట్లయితే రైల్వే పోలీస్ స్టేషన్‌లో గాని 0866-2768630,9440627544లో సంప్రదించాలని కోరారు

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బెక్టాగాన్ ఫెస్ట్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్రంలోనే అత్యుత్తమ సాంకేతిక విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా జరిగే బెక్టాగాన్ ఉత్సవాలు ఈ నెల28 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరుగుతాయని ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ డి.నిరంజన్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ ఉత్సవాలలో టెక్నో, కల్చరల్,స్పోర్ట్స్‌లలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను,రూ. 5లక్షల ప్రత్యేక నగదు బహుమతులను అందజేస్తారన్నారు.ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎల్‌సి ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్, గౌరవ అతిథిగా ఈపిఏఆర్ డిజిటల్ సప్లై చైన్ సెక్యూరిటీ ప్రైవసీ,వైస్ ప్రెసిడెంట్ వడ్లమూడి శైలజ హాజరవుతున్నారని పేర్కొన్నారు. 1వ తేదీ సాయంత్రం జరిగే ముగింపు సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ,ఎంటర్‌ప్రెన్యూర్ ఇండస్ట్రీ లీడర్ డాక్టర్ ఎజె చౌదరి,గౌరవ అతిథిగా సీఈఓ ఎస్.సి.ఈ అండ్ ఎం బెంగళూరు జాన్సన్ జెల్లీస్ విచ్చేయనున్నార న్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో వివిధ కళాశాలల సాంకేతిక విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ కోరారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని కావూరివారి పాలెం,తోటవారిపాలెం పంచా యతీలలో పచ్చిమిర్చి పండించిన రైతులను ఆదుకోవాలని చీరాల వైయస్సార్ రైతు విభాగం అధ్యక్షులు కావూరి రమణారెడ్డి కోరారు.ఆయా గ్రామాలలోని రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చిమిర్చి ధర బాగా పడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నిజాంపట్నం మండలంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో గురువారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.నిజాంపట్నంలోని ఏజీకే పేట ప్రభుత్వ పాఠశాలలో బూత్ నెంబర్ (409) అలాగే అడవులదీవిలోని ప్రభుత్వ పాఠశాలలో బూత్ నెంబర్(410)పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. నిజాంపట్నం(409)పోలింగ్ కేంద్రంలో 737 మంది ఓటర్లకు గాను 475 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.వీరిలో పురుషులు 335 మంది కాగా మహిళలు 140 మంది ఉన్నారు.అడవులదీవి (410) పోలింగ్ కేంద్రంలో 839 మంది ఓటర్లకు గాను 656 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.వీరిలో పురుషులు 473 మంది కాగా మహిళలు 183 మంది ఉన్నారు.మొత్తం మీద నిజాంపట్నం (409) పోలింగ్ 64.45 శాతం, అడవులదీవి (410) పోలింగ్ 78.19 శాతం నమోదయిందని అధికారులు తెలిపారు. నిజాంపట్నం, అడవులదీవి పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సందర్శించి పరిశీలించారు.ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న పోలింగ్ తీరును తహసీల్దార్ షాకీర్ పాషా ఎప్పటికప్పుడు సందర్శించి పర్యవేక్షించారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా ఎస్సై కె.తిరుపతిరావు పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు.

కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలసిన ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్యంగా జగనన్న కాలనీలలో బినామీ ప్లాట్ల రద్దు, పట్టణంలోని ఉర్దూ స్కూల్‌ను హైస్కూల్ గా అప్ గ్రేడ్ చేయడం, గ్రామాలలో నీటి సమస్యలు వంటివి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాలి నడక భక్తులకు మందులు పంపిణీ

విశాలాంధ్ర-మార్కాపురం : శ్రీశైల మహాక్షేత్రంలో జరిగే మహ శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనం కోసం నడకదారిన శ్రీశైలం వెళ్లే శివ భక్తులకు ఉచితంగా పలు రకాల ఔషధాలు పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభమయింది. ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 19 వ తేది గురువారం నల్లమల అడవిలో దామర్లకుంట వద్ద ఈ కార్యక్రమం ప్రారంభం అయింది. ప్రముఖ ఔషధ తయారీ సంస్థలైన లీ ఫార్మా లిమిటెడ్, మరియు ఎస్పార్సీ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఇస్కాన్ ధార్మిక సంస్థ ద్వారా ఈ ఔషధాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం శివాజీ స్ఫూర్తి కేంద్రం ఆర్గనైజింగ్ సెక్రెటరీ సోమయాజుల నాగేశ్వర్ రావు, ప్రకాశం జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గెం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు గుండె సత్యం, మరియు దోర్నాల, పెద్దారవీడు మండల బీజేపీ కన్వీనర్లు వీరారెడ్డి, కోటిరెడ్డి, అలాగే బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి, తంగిరాల సీతారెడ్డి, ట్రస్ట్ సభ్యులు డి. సాయి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : పట్టభద్రులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.ఉమ్మడి గుంటూరు-కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేషన్ శాసనమండలి ఎన్నికలు గురువారం బాపట్ల జిల్లాలోని బాపట్ల,వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ సుడిగాలి పర్యటన చేస్తూ పలు పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. క్యూలైనులు,ఎన్నికల తీరును,భద్రత చర్యలను పర్యవేక్షించారు.ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని,ఓటర్లు ఇబ్బందిపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పోలింగ్ కేంద్రంలోకి పంపాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు,నిషేధిత వస్తువులు అనుమతించవద్దని విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు,సిబ్బందిని ఆదేశించి పలు భద్రతాపరమైన సూచనలు చేశారు.బాపట్ల పట్టణం, కర్లపాలెం,రేపల్లె పట్టణం, వేమూరు,అడవుల దీవి,వేమూరులతో పాటు ఇతర పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కృష్ణ-గుంటూరు గ్రాడ్యుయేషన్ శాసనమండలి ఎన్నికలకు జిల్లాలోని బాపట్ల,రేపల్లె,వేమూరు నియోజకవర్గాలలోని 15 ప్రాంతాలలో 34 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్నాయన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.9 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు.అవి కర్లపాలెం,రేపల్లె,చుండూరులలో ఉన్నాయన్నారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అధిక సంఖ్యలో పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఏదైనా అనుకోని సమస్య తలెత్తితే వెంటనే చేరుకునే విధంగా 6 రూట్ మొబైల్ పార్టీలను,6 స్ట్రైకింగ్ ఫోర్స్,2 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటు చేసుకుంటే ప్రత్యేక బృందాలు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని సమస్యను పరిష్కరించి శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాయన్నారు.జిల్లాలో మొత్తం 270 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారన్నారు.వీరిలో ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డిఎస్పీలు,ఏడుగురు సీఐలు,13 మంది ఎస్సైలు ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఎవరు గుంపులుగా ఉండరాదన్నారు. ఎవరైనా ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించాలని ప్రయత్నించిన, అవాంఛనీయ ఘటనలు సృష్టించిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పట్టభద్రులు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఎస్.బి ఇన్‌స్పెక్టర్ నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు నమోదు తనిఖీ

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలంలోని దర్శి 4 రైతు సేవ కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు రైతు విశిష్ట గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించడంతో రైతులందరు నమోదు చేయించుకొనుటకు భూమి ఉన్న గ్రామాలకు వెళ్లి రైతు సేవ కేంద్రం లో విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఆ విధంగా చేయించుకున్న రైతులు మాత్రమే వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులు తెలిపారు. ఈ నెల 28 వ తేదీ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు ఆఖరి తేదీ అని తెలిపినారు. మరియు రైతుసేవ కేంద్రం సిబ్బందిని రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె బాలాజీ నాయక్ పాల్గొని రైతులురైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని తెలిపినారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ బాబు , మండల వ్యవసాయ అధికారి వి బాలకృష్ణ నాయక్ , రైతు సేవ కేంద్రం సిబ్బంది కంత అరుణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - తాళ్లూరు: బొద్దికూరపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వత వర్ధిని సోమేశ్వర స్వామి దేవాలయంలో శివ రాత్రి సందర్భంగా చిన్నారులచే నృత్య ప్రదర్శన నిర్వ హించారు. డ్యాన్స్ మాస్టర్ శివ శంకర్ను గ్రామ పెద్దలు సన్మానించారు. చిన్నారులకు బహుమతులు అందజేసారు. ఆలయ పూజారులు వెంకట క్రిష్ణా రావు, పోలం రెడ్డి సుబ్బా రెడ్డి, పద్మావతి, గ్రామ పెద్దలు, శివాలయం అభివృద్ధి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవాలి

విశాలాంధ్ర - తాళ్లూరు: వ్యసాయ ఉత్పత్తులు మద్దతు ధరకు అమ్ముకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. రైతులు పండించి ఏ పంటకైనా పంట రకం, నాణ్యత, దిగుబడుల, వినియోగం అంతర్జాతీయ ధరలు ఎగుమతులు, దిగుమతులు ఆధారంగా ధరలు మారుతూ ఉంటాయని అన్నారు. మార్కెట్ అంచనా ధరలు క్వింటాళ్లకు వరి సాధరణ రకం రూ.2320, ఎ గ్రేడ్ రకం రూ. 2675లు మొక్కజొన్న రూ. 2460, జొన్న రూ. 3120, వేరు శనగ రూ.6760, ప్రత్తి రూ. 7250, మిరప సాధారణ రకం రూ. 13,500, ప్రత్యేక రాలు రూ. 17, 200, పసుపు రూ. 13,200, కందులు రూ. 8680, మినుము రూ.7580, పెసలు రూ. 8750, శనగ రూ. 5,820లుగా అంచనాలు వేయబడినట్లు చెప్పారు. వీఏఏ నాగమల్లేశ్వరి, బ్రహ్మయ్యలు పాల్గొన్నారు.

3న ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో 2024-25 ఖరీఫ్ పంట కాలం ధాన్యం కొనుగోలు కేంద్రాల మార్చి 3వ తేదీ నుంచి మూసివేయటం జరుగుతుందని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఖరీఫ్ పంట కాలంలో జిల్లాలో 2,36,803 మెట్రిక్ టన్నుల దిగుబడి ఇచ్చిందని, ఇందులో ప్రభుత్వం 1,13,500 మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికి 1,10,513.480 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు.

వైభవంగా వీరభద్రుడి స్వామి నగరోత్సవం

విశాలాంధ్ర-దర్శి : దర్శి పట్నంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం ఉదయం వరకు వీరభద్రుని నగరోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దర్శి నగర్ పంచాయతీ వెలమ శ్రేయోభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వెలమవారి వీధిలో వీరభద్రునికి జాతీ ప్రభకట్టుకొని, భక్తులు పూజ కార్యక్రమం నిర్వహించుకొని వీరభద్రుని జాతిప్రభ దర్శి పట్నంలోని పురవీధులలో ఊరేగింపు జరపటం జరిగింది. వెలమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా కోలాటం కళాకారులబృందం కోలాటం వేసుకుంటూ ముందు నడవగా వీరభద్రుని జాతీప్రభ తో నగరోత్సవం జరిగింది. భక్తులు వీరభద్రుని వీర ఖడ్గం చేత భూని, వీరభద్రుని పద్యాలు పాడుతూ, భక్తులు చేతులు పైన, తల పైన, గొంతులో నారసాలు పొడుచుకుంటూ శరభ, శరభ అంటూ, భాజా భజంత్రీలతో, డీజే మైక్ సెట్ లతో, కనులు విందుగా నగరోత్సవము నిర్వహించారు. ఈ నగరోత్సవము వెలమ వారి వీధి నుండి బయలుదేరి, అద్దంకి రోడ్డు వినాయక స్వామిగుడి, శివాలయం బజారు, పుచ్చలమెట్ట, ఏకలవ్య నగర్, తదితర ప్రాంతాలలో నగరోత్సవము జరిగింది

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నదోర్నాలలో పర్యటించిన కలెక్టర్

☞తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

☞కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌తో కలిసి ఆమె దోర్నాల మండలంలోని చిన్న దోర్నాల గ్రామంలో పర్యటించారు. చిన్న దోర్నాల గ్రామంలో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. స్థానికంగా ఉన్న మంచినీటి పథకాలు ఎండిపోయాయని, ఈ గ్రామంలో 2వేల మంది జనాభా ఉన్నారని, 4 ఏజెన్సీల ద్వారా మొత్తం 20 మంచి నీటి ట్యాంకులను రవాణా చేస్తున్నామని అధికారులు కలెక్టరుకు తెలిపారు. స్థానికంగా ఉన్న జాతీయ రహదారి విస్తరణ పనుల వలన మంచినీటి పైపులు వేయటంలో జాప్యం జరుగుతున్నాయని , ఆ పైపులైను త్వరగా వేస్తే సాగర్ నీటిని ఈ గ్రామానికి తీసుకురావచ్చని అధికారులు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ప్రతి ఇంటికీ,మంచినీటి కొళాయి కనెక్షన్ ఉన్నట్లు చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పైపులైను పనులు త్వరగా పూర్తిచేసేలా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కలెక్టర్ వెంట ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. బాల శంకరరావు, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

భూమి రీ సర్వే

రైతుల సమక్షంలోనే జరగాలి

చిన్న గుడిపాడు గ్రామంలో భూమి రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమక్షంలోనే రీ సర్వే జరిగేలా చూడాలి. నిబంధనల ప్రకారం ముందస్తుగా నోటీసులు ఇవ్వాలి" అని అధికారులను ఆదేశించారు. మండలంలోని చిన్న గుడిపాడు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే విధానాన్ని పెద్ద దోర్నాల తహసీల్దార్ కిన్నెర శాంతి, డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మలతో కలెక్టర్ సమీక్షించారు. భూమి రీ సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భూమి స్వభావం, ఉపయోగం గురించి పట్టాదారులైన రైతులను కలెక్టర్ ప్రశ్నించగా నీటి కొరత వల్ల దిగుబడి తగ్గిపోతోంది. అందుకే భూమిని పంటల కోసం వినియోగించలేకపోతున్నాం" అని రైతులు తెలిపారు. కలెక్టర్ స్పష్టంగా పేర్కొంటూ, "రైతులకు ముందుగా నోటీసులు జారీ చేయాలి. వారి సమక్షంలోనే రీ సర్వే చేపట్టాలి" అని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిన్నెర శాంతి, డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ, మండల సర్వేయర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్కే

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టీడీపీ సీనియర్ నాయకులు,రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిజాంపట్నంలోని ఏజీకే పేట ప్రభుత్వ పాఠశాలలో (409) పోలింగ్ బూత్‌ల్లో ఆయన తన ఓటును వేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తాను ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉందని బొమ్మిడి రామకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : రాబోయే బడ్జెట్లో పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు 2 వేల కోట్లు కేటాయించి, ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి పశ్చిమ ప్రాంతానికి సాగు, త్రాగునీరు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు సీపీఐ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతం ఎడారిగా మారుతున్నది కరువు విలయ తాండం వేస్తున్నదన్నారు. ఈ పరిస్థితులలో ఈ ప్రాంతాన్ని కాపాడాలంటే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి సాగు, త్రాగునీరు అందించాలని ఆయన కోరారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య, ఏఐటీయూసీ నాయకులు యోగయ్య, రైతు నాయకులు దస్తగిరి ఉన్నారు.

శభాష్... పోలీసు శాఖ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పర్యాటక కేంద్రమైన భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాల్లో బుధవారం జరిగిన తిరుణాళ్ల సందర్భంగా పోలీసుశాఖ పనితీరు శభాష్ అని యాత్రీకులు, పర్యాటకులు, ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా పామూరు సర్కిల్ ఇనిస్పెక్టర్ ఎం బీమా నాయక్ పగడ్బందీ ప్రణాళికతో భైరవకోన, అటు నారాయణస్వామి దేవస్థానం వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేయడం పట్ల ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. ముఖ్యంగా నారాయణస్వామి దేవస్థానం వద్ద మహిళలు వేల సంఖ్యలో గండ దీపాలు తీసుకొని రావడం, ఎటువంటి తొక్కిసలాటలు కాని ఇబ్బందులు తలెత్తకుండా సీఐ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అంతేకాకుండా కొందరు భక్తులు ఉదయం నుంచి నియమ నిష్టలతో ఉపవాసాలతో గండుదీపాలు ఎత్తుకొని వస్తూ సొమ్మసిల్లిపడిపోతుండగా వెంటనే సీఐ బీమా నాయక్ వారిని క్రిందపడకుండా పోలీసువారి ఆధ్వర్యంలో పక్కకు తీసుకెళ్లి గుడి లోపలికి కూర్చోపెట్టడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని అన్నారు. అదే విధంగా భైరవకోనలో ఎటువంటి ట్రాఫిక్ తలెత్తకుండా ముందస్తు ప్రణాళితో ఐదుగురు ఎస్ఐలు, 80 మంది పోలీసులు, ఒక స్పెషల్ పార్టీ పోలీసులతో నిత్యం పర్యవేక్షిస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. అదే విధంగా నారాయణస్వామి దేవస్థానం వద్ద రాత్రిపూట ఒక్కసారిగా వేలాదిమంది తరలిరావడంతో నారాయణస్వామి దేవస్థానం ఆవరణం ఇసుక వేస్తే రాలనంత జనం రావడంతో కొందరు భక్తులు ఇబ్బంది పడతామనుకున్న తరుణంలో పోలీసులు గస్తీ తిరుగుతూ ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పామూరు సీఐ ఎం బీమా నాయక్, సీఎస్‌పురం ఎస్ఐ ఆర్ సుమన్, వెలిగండ్ల ఎస్ఐ మధుసూదన్‌రావు, పామూరు ఎస్ఐ కిషోర్‌బాబు బందోబస్తు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భైరవకోన, శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఒక్క చిన్న సంఘటన కూడా జరగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీఐ బీమా నాయక్ ముందస్తు ప్రణాళిక తీసుకోవడంతో ఈ విధంగా జరిగిందని యాత్రీకులు, ప్రజలు సీఐ బీమా నాయక్ పనితీరు పట్ల ప్రశంసలు కురిపిస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

సమతుల్య ఆహారంపై శిక్షణ

విశాలాంధ్ర - ఘంటసాల: ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల వారు వ్యవసాయ పాలటెక్నిక్ కళాశాల, ఘంటశాలలో సమతుల్య ఆహారంపై శిక్షణా నిర్వహించారు. కె.వి.కె సమన్వయకర్త డా. డి. సుధారాణి సమతుల్య ఆహారం యొక్క ప్రాధాన్యతను వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి. కృష్ణవేణి వివిధ ఆహార సమూహాలు, ఆహార పిరమిడ్, బాడీ మాస్ ఇండెక్స్, కౌమారదశలో ఆహార వనరులు తృణధాన్యాలతో కూడిన సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. శాస్త్రవేత్త డా.కె. రేవతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కోసం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి గురువారం అమరావతి గ్రౌండ్ నందు క్యాంపు కార్యాలయంలో సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ నాయబ్‌రసూల్ (బడే) రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ ఎక్కడో మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో ఉంటూ తమ గ్రామమైన కోవిలంపాడుకు శివరాత్రి సందర్భంగా వచ్చి కనిగిరి ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం రూ.50 వేలు తనవంతుగా సహాయం చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా నాయబ్‌రసూల్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, టీడీపీ నాయకులు ఖలీల్, వీరభద్రాపురం నాయబ్‌రసూల్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పీవీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళి పరిశీలించిన ఆలపాటి

విశాలాంధ్ర - బాపట్ల : ఉమ్మడి గుంటూరు - కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల పోలింగ్ తీరును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కూటమి నేతలతో కలిసి పరిశీలించారు.అనంతరం అధికారులను ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని,పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై ఓటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆయనతోపాటు టిడిపి నేతలు సచిన్,మానం విజేత,పల్లం సరోజిని,కూచిపూడి ఝాన్సీ రాణి,నజ్మా,అడే వంశీ,ఐనంపూడి షాలెంరాజు తదితరులు ఉన్నారు.

గొల్లపల్లిపై కేసు నమోదు చేయాలి

- జై భీమ్ రావ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్రే కోటయ్య

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి గేటుకు అడ్డంగా నిలుచుని దౌర్జన్యాలకు దారుణాలకి పాల్పడ్డారని జై భీమ్ భారత్ రావ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య,నియోజకవర్గ అధ్యక్షుడు కొచ్చర్ల వినయ్ రాజు తెలిపారు.గురువారం రాత్రి వారి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ టిడిపి పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు అన్యాయంగా పిడిఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్ కుమార్‌పై దాడి చేయటం జరిగిందన్నారు.144 సెక్షన్ అమల్లో ఉండగా గొల్లపల్లి శ్రీనివాసరావు తన అనుచరులతో గుంపుగా వెళ్లటం ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధం అన్నారు. వెంటనే గొల్లపల్లి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేయాలని కోరారు.తెలుగుదేశం పార్టీకి స్థానిక ఎమ్మెల్యే వేగేష్ నరేంద్ర వరకు చెడ్డ పేరు తెచ్చే విధంగా గొల్లపల్లి శ్రీనివాసరావు చేస్తున్న క్రియలను గమనించాలని కోరారు.

ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

విశాలాంధ్ర-కొల్లూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కొల్లూరులో ప్రశాంతంగా ముగిసాయి. గురువారం మండల కేంద్రం కొల్లూర బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియంలో భాగంగా పట్టభద్ర ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొల్లూరులో 395, 396 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా మొత్తం 1809 మంది పట్టభద్ర ఓటర్లకు గాను, 1328 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం మీద మండల వ్యాప్తంగా 73.41 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. 395 పోలింగ్ బూత్‌లో 428 మంది పురుష ఓటర్లు, 269 మంది మహిళా ఓటర్లు ఓట్టు హక్కును వినియోగించుకోగా మొత్తం మీద 697 మంది పట్టభద్రులు ఓట్లు వేశారు. 396 పోలింగ్ బూత్‌లో 631 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, వారిలో 378 మంది పురుష ఓటర్లు, 253 మంది మహిళా ఓటర్లు పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేశారు. 395 పోలింగ్ బూత్‌లో పోలింగ్ ప్రక్రియ నిదానించడం కారణంగా ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరి సాయంత్రం 5 గంటల వరకు వేచి ఉండి ఓట్లు వేశారు. పోలింగ్ పీఓలుగా సత్యనారాయణ, శేషుగోపాలంలు వ్యవహరించారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేవిదంగా కొల్లూరు తహశీల్దార్ బి. వెంకటేశ్వర్లు, వేమూరు సీఐ బీవీ. ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు పర్యవేక్షించారు.

దళిత హక్కుల పోరాట సమితి సదస్సును జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - అద్దంకి : మార్చి 4న బాపట్లలో జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవాది సుబ్బారావు దళిత సోదరులకు పిలుపునిచ్చారు.సదస్సును జయప్రదం చేసేందుకు కార్యాచరణ రూపొందించేందుకు గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో డిహెచ్‌పిఎస్ నాయకుల సమావేశం జరిగింది.సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నిష్పత్తి ప్రకారం కేటాయించాలన్నారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి నష్టపరిహారాన్ని బాధిత కుటుంబాలకు వెంటనే చెల్లించాలన్నారు.కుల వివక్ష దాడులను నిరోధించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు నివేశన స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించుకునేందుకు ఐదు లక్షలు ఇవ్వాలన్నారు.గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన 27 పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు.మార్చి 4న బాపట్లలో జరగనున్న డిహెచ్‌పిఎస్ జిల్లా సదస్సుకు అద్దంకి నియోజకవర్గ నుంచి పెద్ద ఎత్తున దళిత సోదరులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సుబ్బారావు కోరారు.కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కన్వీనర్ పులిపాటి వీరయ్య,సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ,బీఎస్పీ అద్దంకి నియోజకవర్గ కన్వీనర్ మందా జోసఫ్,జై భీమ్‌రావు భారత్ పార్టీ కన్వీనర్ పులిపాటి హేబేలు,ఏపీ ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీస్ అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు,ఆంజనేయులు,గద్దల రమేష్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో ఫ్లెక్సీలు, హోర్డింగులు,బ్యానర్లు మున్సిపల్ అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే ఏపీ మున్సిపల్ చట్టం-1965 ప్రకారం తయారు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు.మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ఎల్.ఎస్తేరమ్మ అధ్యక్షతన కౌన్సిల్ హాలులో గురువారం జరిగింది.కమిషనర్ మాట్లాడుతూ అద్దంకి మున్సిపల్ పరిధిలో ఎవరైనా ఫ్లెక్సీలు,బ్యానర్లు,యాడ్ ఏజెన్సీల హోర్డింగులు ఏర్పాటుకు మున్సిపల్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. పట్టణంలో ముఖ్యమైన ప్రదేశాలలో ఫ్లెక్సీలు ఏర్పాటుకు అనుమతి ఇవ్వమన్నారు.సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 46 అంశాలకు సంబంధించి 40 అంశాలకు కౌన్సిల్ ఆమోదం పొందినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.మిగిలిన 6 అంశాలకు సంబంధించి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.సమావేశంలో వైస్ చైర్మన్ దేసు పద్మేష్,మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి,కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బాలకోటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.10,52,647

విశాలాంధ్ర - రేపల్లె : మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా మండలంలోని అరవపల్లి గ్రామంలో గల శ్రీబాల కోటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా రూ.10,52,647లు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి దీవి వెంకట అప్పలాచార్యులు తెలిపారు.గురువారం సాయంత్రం దేవస్థాన ప్రాంగణంలో జరిగిన లెక్కింపులో హుండీలు,దర్శనం టిక్కెట్లు,కేశఖండన,అభిషేకం ప్రసాదం,నెయ్యి,తలనీలాలు కొబ్బరి చిప్పల అమ్మకం ద్వారా హుండీ లెక్కించగా రూ.10 లక్షల 52, వేల 647 రూపాయలు ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రూ.27 వేల 46 రూపాయలు ఆదాయం పెరిగిందని ఈవో తెలిపారు. సహకరించిన అధికారులకు,ఉద్యోగులకు ఈవో అప్పలాచార్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేమూరులో 75 శాతం పోలింగ్ నమోదు

విశాలాంధ్ర - వేమూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో మిగతా నియోజకవర్గాల కంటే వేమూరులో అధిక శాతం పోలింగ్ నమోదైంది.ఐదు మండలాల్లో 75శాతం పోలింగ్ జరిగినట్టు అధికారులు వివరించారు.ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పార్టీ శ్రేణులను సమన్వయపరచి బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఉండాలని ఆదేశించి పార్టీ శ్రేణుల చేత పోల్ మేనేజ్మెంట్ చేయించడం సఫలీకృతులయ్యారు. దాదాపు 73 శాతానికి పైగా ఓటింగ్ నమోదైనట్టు వివరించారు.ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ఒక దశలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బార్లు తీరే పరిస్థితి ఏర్పడింది.వేమూరులోని రెండు కేంద్రాల్లో 75.28 శాతం నమోదు కాగా, అమృతలూరు మండలంలో 80.71,చుండూరు మండలంలో 71.65,కొల్లూరు మండలంలో 73.34, భట్టిప్రోలు మండలంలో 73.36 శాతం ఓట్లు పోలింగ్ నమోదు అయ్యాయి. నియోజకవర్గంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుపుకోకుండా పటిష్ట బందోబస్తు మధ్య పట్టబదుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మద్దతుదారులైన కూటమి పార్టీ శ్రేణులు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు నడిపించడంలో సఫలీకృతులయ్యారు.దూర ప్రాంతాల నుంచి కూడా ఎమ్మెల్సీ ఓటు వేయటానికి ఓటర్లు ఆసక్తి కనబరిచి పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. బాపట్ల జిల్లాలో ఎమ్మెల్సీ ఓటింగ్‌లో వేమూరు నియోజకవర్గం ప్రత్యేకత చాటుకుంది.

279జీవో అమలు వెనక్కి తీసుకోవాలి

- ☛279జీఓ వద్దు అప్కాస్ ముద్దు
- ☛రాజకీయ విభేదాలతో కార్మికులకు నష్టం కల్గించవద్దు
- ☛ ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర - చీరాల : కార్మిక వర్గానికి నష్టం కలిగించే ఆలోచనలు కూటమి ప్రభుత్వం మానుకోవాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కోటి దాసు అన్నారు.గురువారం చీరాల అంబేద్కర్ భవన్‌లో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడి సమావేశం నిర్వహించి 33మందితో నూతన కమిటీని ఎన్నుకొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కోటి దాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో కార్మికుల కోసం తీసుకున్న 279జీఓ అమలు వలన కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు.గత ప్రభుత్వం ఏవైనా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే వాటిని సరి చెయ్యాలి కానీ మంచి నిర్ణయాలు కూడా రద్దు చేస్తామని కార్మికులకు నష్టం కలిగించే చర్యలు మానుకోవాలన్నారు.279జీఓ అమలు వద్దని అప్కాస్ ముద్దని కార్మికులకు రక్షణ కల్పించే అప్కాస్‌ను కొనసాగించాలని కోరారు.ప్రభుత్వం తీసుకున్న జీఓ నంబర్ 279 అమలు నిర్ణయం వెనక్కు తీసుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నిరసనలు చేపడుతుందని హెచ్చరించారు.మార్చి 1న చీరాల మునిసిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద,మార్చి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.అనంతరం 33మందితో కూడిన కమిటీని ఎన్నుకోగా గౌరవ అధ్యక్షులుగా పోట్లూరి సుబ్బారాయుడు,అధ్యక్షులుగా దేవతోటి నాగేశ్వరరావు,ఉపాధ్యక్షులుగా కొమ్మూరి రాజేష్,కావూరి యాకోబు,తెల్ల రాంబాబు,ఆధిపోగు సురేష్, కార్యదర్శిగా డొక్కా సురేష్,సహాయ కార్యదర్శిగా మన్నెం నిర్మల,ఉన్నం ఎలీషా,కొమ్మూరి ప్రభావతి,షేక్ కరీముల్లా,ఓరుపల్లి సంధ్య,శీలం సరిత,ఆర్గనైజింగ్ సెక్రటరీగా మురికిపూడి నాగేశ్వరరావు,కోశాధికారిగా గాడిపేరి మెరిమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్,మునిసిపల్ వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి డొక్కా మాల్యాద్రి,జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ మానికల శ్రీను,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాపట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంలో అధికారుల పనితీరు మారాలి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : గుంతల రహిత రహదారుల నిర్మాణంలో అధికారుల పనితీరు మారాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. రేపల్లె-నిజాంపట్నం,చెరుకుపల్లి-నిజాంపట్నం,పిట్టలవానిపాలెం,నగరం మండలాలలో రహదారుల మరమ్మతు పనులను జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు.మరమ్మతు పనులు సక్రమంగా జరగకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.ఆయా రహదారులను కలెక్టర్ పరిశీలించారు.గుంతలు రహిత కార్యక్రమం కింద పనులు మంజూరై మూడు నెలలు గడిచిందన్నారు.నేటికి కొన్ని ప్రాంతాలలో పనులు ప్రారంభించక పోవడం ఏమిటని ఆర్ అండ్ బి అధికారులను ఆయన ప్రశ్నించారు.రహదారులపై గోతులు పడి వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులకు పట్టడం లేదా అని నిలదీశారు.ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి గుంతల రహిత కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టిందన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పనులలో పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.పివిపాలెం మండలంలోని 13 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి అధికారులు చేపట్టిన మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు.రహదారిపై నడుచుకుని వెళ్తూ స్థానికులతోనూ కలెక్టర్ మాట్లాడారు. మరమ్మతు పనులు ఎప్పుడు జరిగాయి,ఎలా జరుగుతున్నాయి,ప్రజలకు ఉపయోగంగా ఉందా,అంటూ అరా తీశారు.ప్రజల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు సూచించినప్పటికీ పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు.ప్రజల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోకపోవడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు.ప్రజా ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.